క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత

షాద్‌నగర్: మండల పరిధిలోని మొగిలిగిద్దలో మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన రైతు గొల్ల బుచ్చయ్య కుమారుడు శివకుమార్(21) మృతి చెందగా.. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి బుధవారం గ్రామానికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన రూ.10వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు కోట్ల శ్రీశైలం, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు వినూత్నంగా ఆలోచించాలి

శంకర్‌పల్లి: విద్యార్థులు పాఠశాల దశలో ఉన్నప్పుడే వినూత్న ఆలోచనలు చేస్తూ, కొత్త కొత్త ఆవిష్కరణలు చేయాలని పట్టణమోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సునీత అన్నారు. బుధవారం పాఠశాలలో అటల్ ఇన్నోవేషన్ మిషన్ ఆధ్వర్యంలో 'అటల్ టింకరింగ్ డే' నిర్వహించగా.. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు ట్రైనర్స్ సూచనలతో 'వ్యాక్యూమ్ క్లీనర్స్' ని ఒకే వేదికపై తయారు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించడానికి నిత్యం ఏదో ఒక కార్యక్రమం చేపడుతున్నామన్నారు. దీనిని భవిష్యత్తులో మరింత ముందుకు తీసుకెళ్లనున్నట్లు స్పష్టం చేశారు.

చెట్లతోనే మానవాళి మనుగడ

సీఐ కాంతారెడ్డి



మొక్కలు నాటుతున్న సీఐ కాంతారెడ్డి, పాఠశాల సిబ్బంది

షాబాద్: పచ్చని చెట్లే ప్రకృతిని సమతూల్యంగా ఉంచుతూ ప్రాణకోటికి జీవనాధారంగా నిలుస్తాయని సీఐ కాంతారెడ్డి, హెచ్‌ఎం మల్లేశ్‌గౌడ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఎల్గొండగూడ ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ విద్యాసంవత్సరం విద్యార్థుల సంఖ్యను పెంచినందుకు ఉపాధ్యాయులను, గ్రామస్తులను సీఐ అభినందించారు. సొంత డబ్బులతో ప్రహరీ, స్టేజ్, సరస్వతి మాత విగ్రహం ఏర్పాటు చేస్తునందుకు దాత రవీందర్‌రెడ్డిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆంజనేయులుగౌడ్, పంచాయతీ కార్యదర్శి యాదయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

విద్యతోనే విజ్ఞానం

ఎంఈఓ మల్లయ్య



సరస్వతి దేవి పూజలో పాల్గొన్న ఎంఈఓ మల్లయ్య, పూర్వ విద్యార్థులు

మొయినాబాద్‌రూరల్: చదువుతోనే ప్రతీ ఒక్కరికి విజ్ఞానం పెరుగుతుందని మండల విద్యాధికారి మల్లయ్య అన్నారు. మండల పరిధిలోని అమ్డాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1988–89 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు నూతనంగా సరస్వతీ దేవి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు పాల్గొని సరస్వతీ దేవికి పూజలతో పాటు అమ్మవారి విగ్రహ ఆవిష్కరించారు. అనంతరం పూర్వ విద్యార్థులను వారు అభినందించారు. కార్యక్రమంలో విశ్వకర్మ మండల గౌరవ అధ్యక్షుడు నర్సింహాచారి, హెచ్‌ఎం రేణుక, పంచాయతీ కార్యదర్శి కవిత, పశువైద్యాధికారి దేవిరెడ్డి, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణలో తాత్కాలిక మరమ్మతులు



ఎస్సీ బాలుర వసతి గృహం ఎదుట మొరం పోయిస్తున్న దాత

చేవెళ్ల: కురుస్తున్న వర్షాలకు వసతి గృహం ఎదుట నిలిచిన నీటిలో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను గమనించిన దాత విష్ణుగౌడ్ పాఠశాల ఆవరణలో మరమ్మతులు చేయించాడు. బుధవారం మండలంలోని గొల్లపల్లికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు విష్ణుగౌడ్ తన సొంత నిధులతో ఎస్సీ బాలుర వసతి గృహం ఎదుట మొరం పోయించి చదును చేయించాడు. వర్షాలతో నీరు నిలిచి విద్యార్థుల ఇబ్బందులపై పత్రికల్లో, సోషల్ మీడియాలో వచ్చిన వార్తలతో స్పందించిన ఆయన సమస్య తీర్చాడు. దీనిపై మండల ప్రజలు, నాయకులు ఆయనను అభినందించారు. ఆయనకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

మౌలిక సదుపాయాలకు పెద్దపీట

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సీసీరోడ్డు నిర్మాణానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యేకు న్యాయవాదులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు విశ్వం, బాబర్‌ఖాన్, శ్రీనివాస్‌గౌడ్, బాల్‌రాజ్‌గౌడ్, రాజేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సత్తయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కాంగ్రెస్ విషప్రచారాలు సరికాదు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న శ్రీవర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: ఎన్నికల్లో బీజేపీ ఓట్లు చోరీ చేస్తుందని కాంగ్రెస్ పార్టీ నాయకులు చేస్తున్న విషప్రచారాన్ని వెంటనే మానుకోవాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య అన్నారు. బుధవారం పట్టణంలోని ఏబీ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రధాని మోదీకి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ లేనిపోని అసత్య ప్రచారాన్ని చేస్తున్నారన్నారు. రాహుల్ గాంధీకి రాజ్యాంగంపై నమ్మకం ఉంటే కేంద్ర ఎన్నికల సంఘం అడిగిన ప్రశ్నలకు ఆయన ఎందుకు సమాధానం చెప్పడం లేదని, అఫిడవిట్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఓట్ల చోరీ పేరుతో కాంగ్రెస్ పనికిమాలిన రాజకీయం చేస్తోందని విమర్శించారు. మోదీ అధికారం చేపట్టాకే ప్రపంచంలోనే బలమైన ఆర్థిక వ్యవస్థగా దేశం రూపుదిద్దుకుంటుందన్నారు. అదేవిధంగా బీహార్‌లో ఎన్నికల సంఘం రోహింగ్యాల ఓట్లను తొలగిస్తుందని, దీంతో కాంగ్రెస్ పార్టీకి చేకూరే నష్టం ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. బీహార్ ఎన్నికల నేపథ్యంలో ఓట్ల చోరీ అంటూ కాంగ్రెస్ పార్టీ అబద్ధాలు మాట్లాడటం సరికాదన్నారు. రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఉచిత బస్సు పథకం తప్పా ఏ హామీని నెరవేర్చలేదని, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఓటరు జాబితాలపై తప్పుడు ఆరోపణలు మానుకోవాలని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు కమ్మరి భూపాలాచారి, అశోక్‌కుమార్, చెట్ల వెంకటేష్, ప్రశాంత్, వంశీ, మల్చలం మురళీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతి

షాద్‌నగర్: బంజారా భవనం నిర్మాణానికి గత ప్రభుత్వం కేటాయించిన ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని, ఆ భూమిని కాపాడాలని కోరుతూ బుధవారం లంబాడీ హక్కుల పోరాట సమితి నాయకులు ఆర్డీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్ జ్యోతికి వినతి పత్రం అందజేశారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని గుండ్లకుంట గ్రామ శివారులో గత ప్రభుత్వం బంజారా భవనం నిర్మాణానికి ఒక ఎకరా భూమిని కేటాయించి.. నిర్మాణానికి గాను రూ.2కోట్లతో అంచనా వ్యయాన్ని రూపొందించినట్లు తెలిపారు. అయితే కొందరు వ్యక్తులు బంజారా భవనం నిర్మాణానికి కేటాయించిన భూమిని కబ్జా చేశారని, అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని సర్వే చేసి హద్దు రాళ్లను ఏర్పాటు చేయాలని కోరారు. లేనిపక్షంలో గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గిరిజన సంఘం జిల్లా చైర్మన్ శ్రీనునాయక్, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఈశ్వర్‌నాయక్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనునాయక్, నాయకుల తదితరులు ఉన్నారు.

రోడ్లతోనే గ్రామాలు అభివృద్ధి



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న మాజీ ప్రజాప్రతినిధులు

నందిగామ: రోడ్లతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని నర్సప్పగూడ మాజీ సర్పంచ్ కావలి కృష్ణ అన్నారు. మండల పరిధిలోని నర్సప్పగూడలో బుధవారం ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు పనులను పలువురు గ్రామస్తులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ సబ్ ప్లాన్ కింద హెచ్‌ఎండీఏ నిధులు రూ.14లక్షల వ్యయంతో సీసీరోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో మౌలిక వసతులు కల్పించేందుకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ నీరటి రవీందర్, మాజీ వార్డు సభ్యుడు కాట్న బాల్‌రాజ్, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు జెగ్గ శేఖర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మా టీచర్ మాకు కావాలి

ఉపాధ్యాయురాలి డిప్యూటేషన్ రద్దు చేయాలని రోడ్డెక్కిన విద్యార్థులు



డిప్యూటేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై బైఠాయించిన విద్యార్థులు, గ్రామస్తులు

కొందుర్గు: తమ పాఠశాల నుంచి డిప్యూటేషన్‌పై వెళ్లిన ఉపాధ్యాయురాలు సుష్మితారెడ్డి డిప్యూటేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని చెర్కుపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా బుధవారం ఎమ్మార్సీ భవనం ఎదుట విద్యార్థులు, గ్రామస్తులు ధర్నా చేశారు. అనంతరం కొందుర్గు బస్టాండ్ ఎదుట షాద్‌నగర్–పరిగి రోడ్డుపై బైఠాయించారు. మా టీచర్ మాకు కావాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఉపసర్పంచ్ యాదయ్య మాట్లాడుతూ.. తమ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5 తరగతులకు గాను 50 మంది విద్యార్థులు చదువుతున్నారని, హెచ్‌ఎం శివారెడ్డితో పాటు ఉపాధ్యాయురాలు సుష్మితారెడ్డి విధులు నిర్వహించేవారని తెలిపారు. ప్రస్తుతం సుష్మితారెడ్డి డిప్యూటేషన్‌పై వెళ్లడంతో ఒకే ఉపాధ్యాయుడు 5 తరగతులకు ఎలా బోధిస్తారని ప్రశ్నించారు. ఒకే ఉపాధ్యాయుడు ఉండటంతో విద్యార్థులకు సరైన విద్య అందడం లేదన్నారు. డిప్యూటేషన్‌పై వెళ్లిన టీచర్‌ను వెంటనే తిరిగి పంపించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ బాలస్వామి సంఘటన స్థలానికి చేరుకొని చెర్కుపల్లి గ్రామస్తులతో మాట్లాడినా సమస్య సద్దుమనగలేదు. దీంతో కొందుర్గు కాంప్లెక్స్ హెచ్‌ఎం గోపినాథ్ అక్కడికి చేరుకొని సదరు ఉపాధ్యాయురాలు స్థానంలో మరో ఉపాధ్యాయురాలును పంపిస్తామని సర్దిచెప్పి ఆందోళన విరమింపజేశారు.

ఎంఈఓ వివరణ..

ఈ విషయమై ఎంఈఓ గాయత్రిని వివరణ కోరగా.. మండలంలోని లక్ష్మీదేవిపల్లి, ఆగిర్యాల, చెర్కుపల్లి, ముట్పూర్, ఉమ్మెంత్యాల గ్రామాలకు సంబంధించిన పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై పంపించేందుకు ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వచ్చాయని తెలిపారు. ఇప్పటికే ఇద్దరు ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై పంపామన్నారు. వారి డిప్యూటేషన్ రద్దు చేయడానికి తమకు ఎలాంటి అధికారం లేదన్నారు. చెర్కుపల్లి పాఠశాలకు మరో ఉపాధ్యాయురాలిని పంపిస్తామని వివరించారు.

మత్తు రహిత సమాజాన్ని నిర్మిద్దాం



షాద్‌నగర్‌రూరల్: డ్రగ్స్ నిర్మూలనపై విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధ్యాపకులు



చేవెళ్ల: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ ఎస్‌ఐ రవీందర్‌రెడ్డి

ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె

షాద్‌నగర్‌రూరల్: ప్రతి ఒక్కరూ మత్తు రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె అన్నారు. పట్టణ సమీపంలోని నూర్ ఇంజినీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో బుధవారం ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ నీతాపోలె హాజరై 'డ్రగ్స్ ఫ్రీ ఇండియా'పై అవగాహన కల్పించారు. డ్రగ్స్ నిర్మూలనపై విద్యార్థినులతో సామూహిక ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలను వినియోగిస్తే ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. డ్రగ్ వినియోగంతో వ్యక్తిగత జీవితంతో పాటుగా సమాజంపై పెను దుష్ప్రభావాలు ఉంటాయన్నారు. యువత వ్యసనాలకు బానిసలు కాకుండా మంచి ఆలోచనలతో ముందుకు సాగాలని సూచించారు. ఇలాంటి కార్యక్రమాలు యువతలో చైతన్యాన్ని కలిగించేందుకు ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్లు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

మత్తుతో జీవితాలు చిత్తు

చేవెళ్ల: విద్యార్థులు మత్తు పదార్థాల బారిన పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేశ్‌బాబు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం పట్టణ ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌ఐలు ఖాజామొయినుద్దీన్, రవీందర్‌రెడ్డి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ దేశభక్తి కలిగి ఉండాలి

మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం



మాట్లాడుతున్న కేఎస్ రత్నం

షాబాద్: ప్రతి ఒక్కరూ దేశభక్తిని కలిగి ఉండాలని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. బుధవారం మండల పరిధిలోని నాగర్‌గూడలోని మినీ ఫంక్షన్ హాల్‌లో బీజేపీ కార్యకర్తలతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు పురస్కరించుకొని ఈ నెల 14వ తేదీ గురువారం మండలంలో నిర్వహించే హర్ ఘర్ తిరంగా, ఘర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. హర్ ఘర్ తిరంగా వంటి కార్యక్రమాలతో అందరిలో దేశభక్తి పెరిగి జాతీయ ఐక్యత పెంపొందుతుందన్నారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు తిరంగా యాత్ర నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, మండల ఎన్నికల ఇన్‌చార్జి ప్రభాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మాణయ్య, మాజీ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, బీజేవైఎం స్వచ్ఛభారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము తదితరులు ఉన్నారు.

దివ్యాంగులకు రిజర్వేషన్లు కల్పించాలి



ఆర్డీఓ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న శేఖర్‌గౌడ్

ఎన్‌పీఆర్‌డీ డివిజన్ అధ్యక్షుడు శేఖర్‌గౌడ్

షాద్‌నగర్: స్థానిక ఎన్నికల్లో ప్రభుత్వం దివ్యాంగులకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) డివిజన్ అధ్యక్షుడు చేగూరి శేఖర్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం షాద్‌నగర్ ఆర్డీఓ సరితను ఆ వేదిక నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే స్థానిక ఎన్నికల్లో దివ్యాంగులకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఎన్నికల ముందుకు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం దివ్యాంగులకు పెన్షన్‌ను పెంచాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లలో తమకు 5 శాతం మంజూరు చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. దివ్యాంగుల సంక్షేమం కోసం రూపొందించిన చట్టాలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మనీలా, విజయ, చిన్నమ్మ, నర్సింహ, సురేష్, ఆంజనేయులు, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు పరిహారం ఇవ్వాలి

అసైన్డ్ ల్యాండ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శివయ్య



ఆర్డీఓ కార్యాలయం ఎదుట మాట్లాడుతున్న శివయ్య, బాధిత రైతులు

చేవెళ్ల: ప్రభుత్వం పేదల నుంచి తీసుకున్న భూములకు సంబంధించి అందరికీ సరైన న్యాయం చేయాలని అసైన్డ్ ల్యాండ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోళ్ల శివయ్య, ఉపాధ్యక్షుడు బింగి రాములు అన్నారు. బుధవారం మండలంలోని మోకిల గ్రామానికి చెందిన బాధిత రైతులతో వారు చేవెళ్లలోని ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లి న్యాయం చేయాలంటూ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలోని సర్వే నంబర్ 96లో పేద రైతులకు చెందిన భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని హెచ్‌ఎండీఏకు అప్పగించిందన్నారు. అందులో ఖరీజు ఖాతా కలిగిన రైతులలో కొంత మందికి 600ల గజాల స్థలాన్ని ఇచ్చారని.. మిగతా 30 మంది రైతులకు ఎటువంటి నష్టపరిహారం ఇవ్వలేదని ఆరోపించారు. భూమి కోల్పోయిన రైతులందరికీ ఒకటే న్యాయం చేయాలన్నారు. వెంటనే మిగతా రైతులకు కూడా నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా ఆర్డీఓకు ఆ భూములకు సంబంధించిన పత్రాలను అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్డీఓ చంద్రకళ సానుకూలంగా స్పందించి పత్రాలను పరిశీలించి విచారణ చేసి న్యాయం చేస్తామని చెప్పారన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు సీహెచ్ కృష్ణ, నాయకులు నరేంద్ర, శివ, శంకర్, రైతులు నర్సింలు, శమంత, పోచమ్మ, లక్ష్మయ్య, అశోక్ తదితరులు ఉన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు జంగయ్య



కొందుర్గు: వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కొందుర్గు: సీపీఐ రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యవర్గ సభ్యుడు బుద్దుల జంగయ్య పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బుధవారం మండలంలోని రామచంద్రాపూర్‌లో మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 100 ఏళ్ల చరిత్ర గల సీపీఐ రాష్ట్ర మహాసభలు ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు మేడ్చెల్ మల్కాజ్‌గిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారంలోని మహాగార్డెన్‌లో నిర్వహిస్తున్నామన్నారు. ఈ మహాసభలకు అన్ని గ్రామాల రైతులు, కార్మికులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లిలో..

శంకర్‌పల్లి: సీపీఐ రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి రామస్వామి పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహంలో రాష్ట్ర మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను జిల్లా కౌన్సిల్ సభ్యుడు ప్రభు లింగంతో కలిసి ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ధ్వంసంపై ఫిర్యాదు

కేశంపేట: మండల పరిధిలోని బైర్కాన్‌పల్లి గ్రామ శివారు నుంచి గొప్లాయకుంట తండాకు వెళ్లే రోడ్డును జేసీబీతో ధ్వంసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రైతులు ఇన్‌చార్జి ఎంపీడీఓ కిష్టయ్యకు మండల కేంద్రంలో బుధవారం ఫిర్యాదు చేశారు. గొప్లాయకుంట తండాకు బీటీ రోడ్డు మంజూరైందని, ఈ రోడ్డు గ్రామానికి చెందిన కుమ్మరి పాండు వ్యవసాయ భూమి మధ్యలో నుంచి వెళ్తుందని, రోడ్డుకిరువైపులా అతడికి వ్యవసాయ భూమి ఉండటంతో జేసీబీ సహాయంతో రోడ్డును ధ్వంసం చేసినట్టు రాయికంటి రామచంద్రయ్య ఫిర్యాదులో తెలిపారు. తండాకు గతంలో ఉన్న విధంగానే బీటీరోడ్డును వేయాలని రైతు ఫిర్యాదులో పేర్కొన్నాడు. వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు కర్ణాకర్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

తహసీల్దార్ కృష్ణయ్య

చేవెళ్ల: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాలతో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ కృష్ణయ్య తెలిపారు. రికార్డు అసిస్టెంట్లు అంజనేయులు, ప్రకాశ్ ఫోన్‌నం 7893735655. జూనియర్ అసిస్టెంట్ నర్సింలు ఫోన్‌నం 7981350260లతో కంట్రోల్ రూమ్ కోసం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు ఒక టీమ్, రాత్రి 9 నుంచి ఉదయం 9 గంటల వరకు మరో టీమ్ 24 గంటలు మూడురోజుల పాటు అందుబాటులో ఉంటుందన్నారు. ఎక్కడైనా భారీ వర్షాలు, వరదలతో ప్రజలు ఏమైనా ఇబ్బందులు ఏర్పడితే వెంటనే కంట్రోల్ రూమ్‌కు ఫోన్‌చేసి సమాచారం అందించాలని సూచించారు.

వాగుల వద్ద బారికేడ్లను ఏర్పాటు చేయాలి

కేశంపేట: రానున్న నాలుగు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ కిష్టయ్య అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఐసీడీఎస్, ఎలక్ట్రిసిటీ, ఈజీఎస్, పోలీస్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందునా అన్ని శాఖ అధికారులు, సిబ్బంది సంయుక్తంగా ఉండి ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టాలు జరగకుండా చూడాలన్నారు. వాగుల వద్ద బారికేట్లను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అజాంఅలీ, మండల వ్యవసాయ అధికారి శిరీష, పంచాయతీరాజ్ ఏఈ నర్సింగ్‌రావు, ఇరిగేషన్ ఏఈ గీత, ఎలక్ట్రిసిటీ ఏఈ ఈశ్వర్, మండల విద్యాధికారి చంద్రశేఖర్, ఏపీఓ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

మొయినాబాద్‌రూరల్: కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ సంధ్య అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో వర్షాల కారణంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. మండలంలోని గ్రామాల్లో ఎలాంటి ఆపదలు వచ్చినా వెంటనే కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నంబర్ 9347216828లో తెలపాలని సూచించారు. వెంటనే అధికారులు తగు చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యదర్శులు ఎప్పటికప్పుడూ పర్యవేక్షించి ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలని సూచించారు.

శిథిల ఇళ్లలో ఉండొద్దు

శంకర్‌పల్లి: రానున్న రెండు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు ఉన్నందున మున్సిపల్ వాసులందరూ అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ యోగేశ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు అవసరమైతే తప్పా ఇంట్లో నుంచి బయటకు రావొద్దని, విద్యుత్ స్తంభాలు, శిథిలావస్థలో ఉన్న ఇళ్లు, భవనాలు, చెట్లకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. అత్యవసర పరిస్థితులు ఏర్పడితే మున్సిపాలిటీలో టోల్ ఫ్రీ నంబర్ 8897600207ను సంప్రదించాలని కోరారు.

విధిగా పారిశుధ్య పనులు చేపట్టాలి

షాద్‌నగర్‌రూరల్: కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ బన్సీలాల్ అన్నారు. బుధవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాబోయే మూడు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున.. కూలేందుకు సిద్ధంగా ఉన్న ప్రభుత్వ భవనాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎట్టి పరిస్థితులలో విద్యార్థులు, ప్రజలు లేకుండాకార్యదర్శులు చూడాలన్నారు. ఎప్పటికప్పుడూ పారిశుధ్య పనులు చేపట్టాలని, తాగునీటి ట్యాంకులను శుభ్రం చేసిన తర్వాతే నీటిని సరఫరా చేయాలని సూచించారు.



చేవెళ్ల: తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్